ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 20 సంచిక : 250 | శుక్రవారం 05, జూన్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR CELL : 8008609999

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా కలకలం

ఐసోలేషన్‌కు ప్రయాణికుడు తరలింపు
స్క్రీనింగ్ కేంద్రంలో ప్రయాణికుడికి పరీక్షలు
వెంటనే ఐసోలేషన్‌కు
తరలించిన వైద్య సిబ్బంది
గాంధీ ఆసుపత్రిలో
ప్రత్యేక ఐసోలేషన్ ఏర్పాటు
శాంపిల్స్ సీసీఎంబీకి పంపిన వైద్యులు
అధికారుల్లో అప్రమత్తత పెరిగిన పరిస్థితి
సూడాన్ నుంచి
వచ్చిన ప్రయాణికుడిపై పరిశీలన
ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ప్రారంభం




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్‌కు సంబంధించి హిస్టరీ ఉన్న ప్రయాణికుడిని గుర్తించడంతో వైద్య అధికారులు అప్రమత్తమయ్యారు. సూడాన్ నుంచి వచ్చిన ..మిగతా 2లో

## భుజంగరావుకు 14 రోజుల రిమాండ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు,
భారీ ఆస్తుల గుర్తింపు, చంచల్‌గూడ జైలుకు తరలింపు
ఏసీబీ ప్రత్యేక కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధింపు
చంచల్‌గూడ జైలుకు తరలించిన అధికారులు
హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఏకకాలంలో 15 చోట్ల సోదాలు
మియాపూర్ హఫీజ్‌పేటలోని నివాసంలో ఏసీబీ తనిఖీలు
బినామీలు, బంధువుల ఇళ్లలోనూ విస్తృతంగా దర్యాప్తు
రూ.5.92 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించినట్లు సమాచారం
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కొనసాగుతున్న విచారణ
ఫోన్ ట్యాపింగ్ కేసులో గతంలోనే అరెస్టై బెయిల్‌పై విడుదలైన భుజంగరావు
తాజా సోదాలతో మళ్లీ కేసు దర్యాప్తు వేగం పెరిగిన పరిస్థితి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న అదనపు ఎస్పీ నాయిని భుజంగరావుకు ఏసీబీ ప్రత్యేక కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆయనను అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా ఏసీబీ బృందాలు బుధవారం తెల్లవారుజామునే హైదరాబాద్‌లో విస్తృత సోదాలు నిర్వహించాయి. మియాపూర్ హఫీజ్‌పేటలోని సాయిరాం టవర్స్‌లో ఉన్న ఆయన నివాసంతో పాటు వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని ..మిగతా 2లో

# ప్రజాపాలనలో.. సంక్షేమం పాతర

## కేసీఆర్ పాలనలో భరోసా.. కాంగ్రెస్ వచ్చాక ఆక్రందన

దేశానికే దిక్సూచిగా నిలిచిన బీఆర్ఎస్ మానవీయ పథకాలు
అన్ని రంగాల్లో సమూల మార్పునకు గొప్ప పునాదులు
పసిగుడ్డు నుంచి పండు ముసలి వరకూ దక్కిన ఫలాలు
ప్రజాపాలనంటూ గద్దెనెక్కి పథకాలకు రేవంత్ తిలోదకాలు


తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు అనేక విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుడుతూ పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి కొత్త బాటలు వేశారు. దేశానికి కొత్తదారి చూపారు. సంక్షేమ రంగంలో వినూత్న సంస్కరణలకు నాందిపలికారు. పదేండ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా, గతంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, లింగమార్పిడీ వ్యక్తులు ఇలా సమాజంలోని ప్రతి వర్గానికీ ఏదో ఒక లబ్ధి చేకూర్చేలా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేయడం విశేషం.

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లోనూ నూతన ఆవిష్కరణలకు చిరునామాగా తెలంగాణను మార్చారనడంలోనూ ఎలాంటి అతిశయోక్తి లేదు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గురుకుల విద్యాలయాలు, ఉచిత విద్యుత్తు, గొర్లు, చేపల పంపిణీ, దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో సంక్షేమ పథకాలు ఉదాహరణగా నిలుస్తాయి. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ ప్రత్యక్షంగా ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చడంతో పాటు, పరోక్షంగా రాష్ట్ర ప్రగతికి దోహదపడ్డాయి. బాల్య వివాహాలు, ..మిగతా 2లో



## ఖమ్మం చిన్నారి ఘటన..
## రంగంలోకి మానవ హక్కుల కమిషన్

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై సుమోటోగా స్పందించి విచారణకు ఆదేశించిన మానవ హక్కుల కమిషన్
సర్కార్ దవాఖానాలో జరిగిన ఘోరం: వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి పసిగుడ్డు ఎడమ చేయి ఆహుతి
వివాహమైన ఎన్నేళ్లకో పుట్టిన కవలల్లో ఒకరికి శాశ్వత వైకల్యం.. తల్లిదండ్రుల కన్నీరు
ఖమ్మం జిల్లా వైరా మండలానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి దంపతుల జీవితంలో తీరని విషాదం
నెలలు నిండకుండానే పుట్టిన శిశువును బరువు తక్కువగా ఉన్నాడని ప్రభుత్వ కేంద్రంలో చేరిక
రక్తం ఎక్కించేందుకు అమర్చిన క్యాన్‌లా లోపంతో మురిగిపోయి నల్లగా మారిన పసివాడి చేయి
పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిలోఫర్‌కు తరలింపు.. ప్రాణాలు దక్కేందుకు శస్త్రచికిత్స
కళ్ల ముందే బిడ్డ చేయి తీసేయడంతో గుండె లవిసేలా రోదిస్తున్న అభాగ్యురాలు రేణుక
ప్రభుత్వం నియమించిన త్రిసభ్య సీనియర్ డాక్టర్ల కమిటీ విచారణ పూర్తి.. బాధ్యులపై చర్యలకు డిమాండ్



**ఖమ్మం, (ప్రజాస్వరం):**
ఒకే కాన్పులో ఇద్దరు మగపిల్లలు జన్మించారన్న ఆనందం ఆ తల్లిదండ్రులకు ఎంతోసేపు నిలవలేదు. పురిట్లోనే ఒక బిడ్డకు ఎదురైన ఘోర ప్రమాదం వారి జీవితాల్లో తీరని చీకట్లను నింపింది. ఏడు నెలలకే పుట్టడం వల్ల ఒక శిశువు తక్కువ బరువుతో, అనారోగ్యంతో ఉన్నాడని ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించడమే ఆ కుటుంబానికి శాపంగా మారింది. కళ్లు కూడా సరిగ్గా తెరవని ఆ పసిగుడ్డుకు చికిత్స చేసే క్రమంలో వైద్య సిబ్బంది చేసిన ఒక చిన్న పొరపాటు, నిర్లక్ష్యం వల్ల ఆ చిన్నారి తన ఎడమ చేతిని శాశ్వతంగా కోల్పోవాల్సి వచ్చింది. పచ్చని సంసారంలో సర్కార్ ఆస్పత్రి సిబ్బంది అజాగ్రత్త ఒక పసిపాప జీవితాన్ని అంధకారం చేసిన ఈ విషాద ఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ..మిగతా 2లో

## అమీర్‌పేటలో షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్ అమీర్‌పేట ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెట్రో పిల్లర్ నంబర్ 1043 సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఈ ఘటన జరిగింది. రెండో అంతస్తులో ఉన్న KSR ఫ్యాషన్స్ దుకాణంలో మొదట మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. అనంతరం అవి క్రమంగా సమీపంలోని ఇతర దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించారు. మూడు ఫైరింజన్లు, ఎనిమిది వాటర్ ట్యాంకర్లను వినియోగించి అగ్నిని అదుపు ..మిగతా 2లో

కేఎస్ఆర్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
ఇతర షాపులకు వ్యాప్తి..
ఫైరింజన్లతో అగ్నిమాపక చర్యలు,
తప్పిన ప్రాణనష్టం
భారీ ఆస్తి నష్టం అంచనా
మెట్రో పిల్లర్ సమీపంలోని షాపింగ్
కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం
మూడు ఫైరింజన్లు,
ఎనిమిది వాటర్ ట్యాంకర్లతో రెస్క్యూ
దుకాణాల్లోని సిబ్బందిని సురక్షితంగా
ఖాళీ చేసిన అగ్నిమాపక సిబ్బంది
దట్టమైన పొగతో
స్థానికులు తీవ్ర ఇబ్బందులు
అమీర్‌పేట ప్రధాన రహదారిపై
భారీ ట్రాఫిక్ జామ్
సమయానికి బయటపడటంతో
ప్రాణనష్టం తప్పిన ఘటన
హెల్మెట్ షాపులో ప్లాస్టిక్ వస్తువులు దగ్ధమవడంతో
మంటల తీవ్రత పెరిగినట్టు అంచనా
భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు
ప్రాథమిక అంచనా
అగ్నిప్రమాదానికి గల కారణాలపై
కొనసాగుతున్న విచారణ

## భారత్ ఆర్థికంగా స్ట్రాంగ్

రాహుల్ గాంధీ ఆరోపణలు అర్థం లేనివి
బీజేపీ నేత అమిత్ మాలవీయ కౌంటర్
ఆర్థిక సునామీ రాబోతోందని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
వ్యవస్థల్లో అసంతృప్తి పెరుగుతోందని కేంద్రంపై విమర్శ
భవిష్యత్తులో ఎమర్జెన్సీ పరిస్థితులు తలెత్తొచ్చని హెచ్చరిక
కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందన
ఆర్థిక సునామీ 2013లోనే వచ్చిందని అమిత్ మాలవీయ వ్యాఖ్య
మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని బీజేపీ వాదన
విద్యుత్ వినియోగం, వాహన విక్రయాల్లో వృద్ధి సూచనలు
ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని కేంద్ర ప్రభుత్వం సమర్థనం
కోవిడ్, యుద్ధాల మధ్యన కూడా స్థిరత్వం సాధించామని వాదన
రాజకీయ విమర్శలు–ఆర్థిక గణాంకాల మధ్య పెరుగుతున్న చర్చ



**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
దేశంలో ఆర్థిక పరిస్థితులపై తీవ్ర చర్చకు దారితీసేలా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. దేశంలో 'ఆర్థిక సునామీ' వంటి పరిస్థితులు రాబోతున్నాయని ఆయన హెచ్చరించారు. కీలక వ్యవస్థల్లో అంతర్గత ..మిగతా 2లో

## తెలంగాణ సెంటిమెంట్ రగిలించే యత్నాలు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యలు
పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణపై కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం
ప్రజాస్వామ్యంలో సభలు పెట్టుకోవడం ప్రతి ఒక్కరి హక్కు అని బీజేపీ నేత వ్యాఖ్య
పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీపై రుద్దడం రాజకీయ దివాళాకోరుతనమని విమర్శ
పీఎం మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిస్తే కొందరికి భయం పట్టుకుంటుందని వ్యాఖ్య
తెలంగాణ పేరుతో రాజకీయాలు చేస్తున్న వారికి చరిత్ర గుర్తు చేయాలని సవాల్
బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై రాంచందర్ రావు తీవ్ర ప్రశ్నలు
తెలంగాణ ఉద్యమానికి దూరంగా ఉన్నవారికి పదవులు ఇచ్చారనే ఆరోపణ
కాంగ్రెస్ ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ అమలుపై నిలదీత
రాష్ట్ర నీటి విధానం, ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వంపై విమర్శలు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జనసేన సభకు అనుమతి ఇచ్చి ఉంటే పరిస్థితి అక్కడితోనే ముగిసేదని ఆయన పేర్కొన్నారు. సభ అనుమతిని ఎందుకు నిరాకరించారో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి ..మిగతా 2లో

# భారత్ ఆర్థికంగా స్ట్రాంగ్

**మొదటిపేజీ తరువాయి**



అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటూ, భవిష్యత్తులో ప్రజా వ్యతిరేకతను అణచివేసేందుకు అత్యవసర పరిస్థితి వంటి చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉండొచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలపై అధికార భారతీయ జనతా పార్టీ తీవ్రంగా స్పందించింది. బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్టు ద్వారా రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండించారు. ప్రజలను భయపెట్టే రాజకీయాలు చేయవద్దని ఆయన చురకలంటించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై రాహుల్ గాంధీ అంచనాలు వాస్తవానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

అమిత్ మాలవీయ తన పోస్టులో 2013 నాటికే అసలైన ఆర్థిక సంక్షోభం వచ్చిందని, అది కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని వ్యాఖ్యానించారు. అప్పటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా ఉందని ఆయన వాదించారు. గత దశాబ్దంలో ఆర్థిక వ్యవస్థపై అనేక అంతర్జాతీయ షాక్‌లు వచ్చినప్పటికీ వాటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని భారత్ అభివృద్ధి చేసుకుందని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగం పెరుగుదల, వాహనాల విక్రయాల్లో వృద్ధి, ఈవే బిల్ జనరేషన్ పెరగడం వంటి అంశాలను ఆయన ఆర్థిక పురోగతికి సూచికలుగా చూపించారు. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని, ఆహార నిల్వలు, విదేశీ మారకద్రవ్య నిల్వలు బలంగా ఉన్నాయని ఆయన వివరించారు. ఈ గణాంకాలు దేశ ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉందని సూచిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది.

2011 నుంచి 2013 మధ్య రూపాయి విలువ భారీగా పడిపోయిందని, విదేశీ మారక నిల్వలు కూడా గణనీయంగా తగ్గాయని అమిత్ మాలవీయ తన పోస్టులో గుర్తు చేశారు. అప్పటి ఆర్థిక పరిస్థితులే నిజమైన సంక్షోభమని, దానిని కాంగ్రెస్ పాలనలోని వైఫల్యంగా అభివర్ణించారు.

ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు విరుద్ధంగా, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన సంక్షోభాలు కోవిడ్ మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ముడిచమురు ధరల పెరుగుదల, సరఫరా గొలుసు అంతరాయాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి పరిస్థితుల మధ్య కూడా భారత్ స్థిరంగా ముందుకు సాగుతోందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనంగా చూపించే ప్రయత్నాలు రాజకీయ ప్రేరితమని బీజేపీ ఆరోపిస్తోంది. ప్రజలను భయపెట్టే వ్యాఖ్యలు చేయడం కంటే వాస్తవ గణాంకాలను పరిగణనలోకి తీసుకోవాలని అమిత్ మాలవీయ సూచించారు. భారత్ ఇప్పుడు సంక్షోభాలను ఎదుర్కొనే శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా మారిందని ఆయన అన్నారు. మొత్తంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఒకవైపు, బీజేపీ గణాంక ఆధారిత ప్రతివాదాలు మరోవైపు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఆర్థిక పరిస్థితులపై భిన్న దృక్కోణాలు వెలువడటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

# ప్రజాపాలనలో.. సంక్షేమం పాతర

**మొదటిపేజీ తరువాయి**

మాతా శిశు మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గాయి. రాష్ట్రంలో మాంసం, చేపల ఉత్పత్తి పెరిగింది. పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గాయి. ఉన్నత చదువులు చదివే బాలికల సంఖ్య పెరిగింది. భూగర్భజలాలు పెరిగాయి. ఈ విప్లవాత్మక మార్పులన్నీ కేసీఆర్ పథకాల ఫలితాలకు తార్కాణాలుగా నిలిచాయి. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అనుసరిస్తున్న అభివృద్ధి విధానాలు యావత్ దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి పలు పథకాలను అమలు చేయడం విశేషం.

**పథకాల రద్దు.. లేదంటే నిధుల కోత..**

వినూత్న పథకాలకు, సంక్షేమానికి మారుపేరుగా నిలిచిన తెలంగాణలో ప్రస్తుత రేవంత్ పాలనలో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. ఆరు గ్యారెంటీలని చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. ఫ్రీ బస్సు మినహా ఒక్క గ్యారెంటీ కూడా అమలు కాలేదు. ఇదిలా ఉంటే గత కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తూ వస్తున్నది. కొన్ని పథకాలను పేరుకు అమలు చేసినా అందులోనూ కోతలు విధిస్తున్నది. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, దళితబంధు, బీసీబంధు, మైనారిటీ బంధు, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి, చేనేతమిత్ర, కంటివెలుగు తదితర స్కీమ్‌లన్నింటినీ రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. కల్యాణలక్ష్మీ, విదేశీ విద్యానిధి, ఉచిత విద్యుత్తు తదితర పథకాలకు నిధుల విడుదల నిలిపివేసింది. కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చిన దాఖలా లేదు. స్వయం ఉపాధి పథకాలు లేవు. ఆరుగ్యారెంటీలు కేవలం ప్రకటనలకే పరిమితం కావడంతో తెలంగాణలోని సబ్బండవర్గాల సంక్షేమం ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయింది.

**పైసా ఇవ్వడమూ కష్టమేనా?**

బీఆర్ఎస్ అమలు చేస్తున్న పలు పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే కొనసాగిస్తున్నది. ఆయా పథకాలకు సంబంధించిన నిధులను కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. కల్యాణలక్ష్మీ పథకానికి సంబంధించిన చెక్కుల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొన్నది. ప్రమాదవశాత్తు మరణించిన గీతకార్మికులకు చెల్లించే ఎక్స్‌గ్రేషియా నిధులను నెలల తరబడి విడుదల చేయడం లేదు. రజకులు, నాయీబ్రాహ్మణులకు సంబంధించి 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లు పేరుకుపోయాయి. ప్రభుత్వం హామీలు ఇవ్వడం తప్ప గడిచిన 24 నెలలుగా రూపాయి విదల్చలేదు. దీంతో కోర్సులు పూర్తి చేసుకున్నా విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బీసీ ఓవర్సీస్ బకాయిలను కూడా సకాలంలో చెల్లించడం లేదు. 2025 స్ప్రింగ్, ఫాల్ సీజన్లకు సంబంధించి ఎంపిక ప్రక్రియనూ పూర్తి చేయలేదు. దీంతో పథకానికి దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య తగ్గిపోతున్నదని అధికారులే వెల్లడిస్తున్నారు. బీసీ స్టడీ సెంటర్లకు నిధులు విదల్చడం లేదు. ఆయా సర్కిళ్లలో పోటీపరీక్షలకు సంబంధించిన శిక్షణ నత్తనడకన కొనసాగుతున్నది. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు మెస్ బిల్లుల చెల్లింపు, అద్దె చెల్లింపు పూర్తిగా గాడి తప్పిపోయింది.తాజా తెలుగు వార్తలు

**చేనేతకు మొండిచెయ్యి**

చేనేత కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. తొలుత బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇస్తూ చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచింది. అటు తర్వాత థ్రిఫ్ట్ తదితర పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా అండగా నిలిచింది. వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రవేశపెట్టి యజమానులుగా తీర్చిదిద్దింది. రైతు బీమా తరహాలోనే చేనేత కార్మికులకు రూ.5 లక్షల బీమా కల్పించింది. మగ్గాల ఆధునికీకరణ చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పథకాలకు పూర్తిగా మొండిచెయ్యే చూపింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడం లేదు. యూనిఫామ్ దుస్తుల టెండర్లను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నది.

**'కంటివెలుగు'పై చీకట్లు**

అంధత్వ రహిత తెలంగాణ నినాదంతో కేసీఆర్ సర్కార్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ కంటిపరీక్షలు నిర్వహించడంతోపాటు, అవసరమైన వారికి కండ్లద్దాలు పంపిణీ చేసింది. పథకం ద్వారా దాదాపు 1,93, 81,127 మందికి పరీక్షలు నిర్వహించింది. కాంగ్రెస్ ఈ పథకాన్ని అటకెక్కించింది.

**పల్లె, పట్టణప్రగతి**

పల్లెలు, పట్టణాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడంతోపాటు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా 2019లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టింది. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. ఏటా డంప్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణం, చెత్తసేకరణ, పారిశుధ్య కార్యక్రమాలు, హరితహారం వంటివి క్రమం తప్పకుండా అమలు చేసింది. ఈ కార్యక్రమాలు 80శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించాయి. కానీ కాంగ్రెస్ ఈ రెండు స్కీమ్‌లను పక్కనపెట్టింది. పంచాయతీలకు డబ్బులివ్వడం లేదు. మున్సిపాలిటీల్లో కనీసం చెత్త ఊడ్చే పరిస్థితి లేదు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్న దుస్థితి. హరితహారం చెట్లు, పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతుండగా, యువకుల కోసం పెట్టిన క్రీడా ప్రాంగణాల్లో చెట్లు మొలుస్తున్న దుస్థితి నెలకొన్నది. ఇటీవల 99రోజుల ప్రణాళికకు కాంగ్రెస్ ప్రభుత్వం పిలుపునిచ్చినా పల్లెలు, పట్టణాల అభివృద్ధికి రూపాయి విదల్చలేదు.

**పైసల కటకట ఉన్న పథకాలు రైతుబంధు**

రైతులకు వానకాలం, యాసంగి పంటల సాగుకు రూ.10వేల పెట్టుబడి అందివ్వడం కోసం 2018లో అప్పటి కేసీఆర్ సర్కార్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారుల సంఖ్య 50.25 లక్షల మందితో మొదలై 65 లక్షలకు చేరుకున్నది. రైతుల మరణాలు తగ్గుముఖం పట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అరకొరగానే అమలు చేస్తున్నది. పెట్టుబడి సాయం ఎప్పుడు వేస్తుందో తెలియని పరిస్థితి ఉన్నది.

**250 యూనిట్ల ఉచిత విద్యుత్తు**

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాయీబ్రాహ్మణుల సెలూన్లు, రజకుల ధోబీఘాట్లకు నెలకు 250 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందించే పథకానికి శ్రీకారం చుట్టింది. తద్వారా 1,07,352 మంది రజక, నాయీబ్రాహ్మణులకు లబ్ధి చేకూరింది. అయితే, ఈ స్కీమ్‌కు సంబంధించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.250 కోట్లను పెండింగ్ పెట్టింది.

**కేసీఆర్ కిట్.. కాంగ్రెస్ కట్**

మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించడం, ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెంచడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవిస్తే మగబిడ్డకు రూ.12 వేలు, ఆడబిడ్డకు 13 వేల ప్రోత్సాహకంతోపాటు, శిశువులకు కావాల్సిన వస్తువుల కిట్లను అందించింది. 2023 చివరి నాటికి దాదాపు 13,29,951 మందికి లబ్ధి చేకూర్చింది. ఫలితంగా సంస్థాగత ప్రసవాల శాతం 91 నుంచి 97 శాతానికి పెరుగగా, ప్రసూతి మరణాల సంఖ్య 92 నుంచి 56 శాతానికి తగ్గింది. నవజాత శిశు మరణాల సంఖ్య 39 నుంచి 17 శాతానికి తగ్గింది. పిల్లల వ్యాక్సినేషన్ రేట్ 68 శాతం నుంచి 96 శాతానికి పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా పక్కనపెట్టింది.

## అమీర్‌పేటలో షాపింగ్ కాంప్లెక్స్‌లో
# భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

చేసే ప్రయత్నం చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఇతర దుకాణాల సిబ్బందిని ముందుగానే బయటకు తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. అమీర్‌పేట ప్రధాన రహదారికి సమీపంలో ఘటన జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దట్టమైన పొగ పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అగ్ని తీవ్రత ఎక్కువగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించారు.

ప్రమాద సమయంలో దుకాణాల్లో ఉన్న సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే షాపింగ్ కాంప్లెక్స్‌లోని అనేక దుకాణాలు పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. ప్రాథమిక అంచనాల ప్రకారం భారీ ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.అదే కాంప్లెక్స్‌లో హెల్మెట్ షాపు ఉండటంతో అక్కడ ఉన్న ప్లాస్టిక్ వస్తువులు కాలిపోవడంతో మంటల తీవ్రత మరింత పెరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు.




# భుజంగరావుకు 14 రోజుల రిమాండ్

**మొదటిపేజీ తరువాయి**

మరో ఇంట్లోనూ తనిఖీలు చేపట్టారు.

అలాగే నల్గొండ, సూర్యాపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఆయన బంధువులు, బినామీలకు చెందిన ఇళ్లలో కూడా ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మొత్తం 15 ప్రాంతాల్లో జరిగిన ఈ దాడుల్లో భారీగా ఆస్తులకు సంబంధించిన పత్రాలు, వివరాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సోదాల అనంతరం ఆయనకు ఉన్న ఆస్తులకు సరైన లెక్కలు చూపలేకపోవడంతో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా సుమారు రూ.5.92 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు గుర్తించినట్లు సమాచారం. భుజంగరావు ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండేళ్ల క్రితమే అరెస్టై బెయిల్‌పై విడుదలయ్యారు. ఇప్పుడు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ మళ్లీ దర్యాప్తు వేగవంతం చేయడం గమనార్హంగా మారింది.






## ఖమ్మం చిన్నారి ఘటన.. రంగంలోకి
# మానవ హక్కుల కమిషన్

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర సంచలనం సృష్టించింది.

ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురి గ్రామానికి చెందిన రేణుక, సత్యకాంత్ దంపతులు ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ సాదాసీదా జీవితం గడుపుతున్నారు. పెళ్లయిన చాలా సంవత్సరాల వరకు వారికి పిల్లలు కలగలేదు. ఎన్నో నోములు, పూజల తర్వాత రేణుక మొదటిసారి గర్భం దాల్చడంతో ఆ కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. అయితే, ఆమెకు ఏడో నెల నడుస్తున్న సమయంలో అకస్మాత్తుగా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అత్యవసర పరిస్థితి అని చెప్పి శస్త్రచికిత్స (సిజేరియన్) చేయగా, మార్చి మూడో తేదీన రేణుక ఇద్దరు కవల మగపిల్లలకు జన్మనిచ్చింది.

పుట్టిన ఇద్దరు పిల్లలలో ఒక బాబు ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ, మరో బాబు కేవలం కేజీన్నర కంటే తక్కువ బరువుతో జన్మించాడు. ఆ చిన్నారికి ఊపిరితిత్తుల సమస్య (లంగ్స్ ఇన్ఫెక్షన్) ఉన్నట్లు ప్రైవేటు వైద్యులు గుర్తించారు. బరువు పెరగడం కోసం, శ్వాస ఇబ్బంది తగ్గడం కోసం బాబును మరికొన్ని రోజులు ఇంక్యూబేటర్ (బాక్స్) లో ఉంచి చికిత్స చేయాలని, అందుకు భారీగా ఖర్చవుతుందని చెప్పారు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో, ఆ కన్నవారు ఎంతో నమ్మకంతో తమ బిడ్డను ఖమ్మంలోని ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తరలించి జాయిన్ చేశారు.ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన తర్వాత చిన్నారికి రక్తం, ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండటంతో వైద్యులు రక్తం ఎక్కించాలని నిర్ణయించారు. ఇందుకోసం డ్యూటీలో ఉన్న నర్సింగ్ సిబ్బంది నవజాత శిశువు ఎడమ చంక భాగంలో క్యాన్‌లాను అమర్చారు. అయితే, ఆ పసికందు నరాలకు క్యాన్‌లాను సరిగ్గా అమర్చకపోవడంతో రక్తం సరిగ్గా సరఫరా కాక చంక భాగంలోనే గడ్డకట్టిపోయింది. రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రాంతమంతా తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. దీంతో నరాలు పూర్తిగా క్షీణించి బాబు ఎడమ చేయి మొత్తం నల్లగా మారిపోయింది. బిడ్డ ఒళ్లంతా ఉబ్బిపోతుండటంతో కంగారుపడిన తల్లిదండ్రులు వైద్యులను నిలదీశారు.

చిన్నారి పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి వైద్యులు కంగారుపడి హడావుడిగా చేతులు దులుపుకుంటూ స్కానింగ్ చేయించారు. చేయి లోపల నరాల కదలిక పూర్తిగా ఆగిపోయిందని గ్రహించి, మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చిన తర్వాత అక్కడి నిపుణులైన వైద్యులు బాబును నిశితంగా పరిశీలించారు. ఇన్ఫెక్షన్ ఒంటికి పాకిందని, వెంటనే ఎడమ చేయిని శస్త్రచికిత్స చేసి పూర్తిగా తొలగించకపోతే పసికందు ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని తల్లిదండ్రులకు తేల్చి చెప్పారు. వేరే మార్గం లేకపోవడంతో వైద్యులు ఆపరేషన్ చేసి చిన్నారి ఎడమ చేతిని మోచేతి వరకు తీసివేశారు.

లోకం వైపు కళ్లయినా తెరవని తన చిన్నారి బిడ్డ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పురిట్లోనే దివ్యాంగుడిగా మారడాన్ని తల్లి రేణుక తట్టుకోలేకపోతోంది. తన ఆవేదనను కన్నీళ్లతో పంచుకుంటూ.. "ఉమ్మునీరు పడిపోవడంతో ఏడో నెలలోనే ఎమర్జెన్సీగా సర్జరీ చేసి ఇద్దరు బాబులను తీశారు. ఒకరు 1.500 కేజీలు, మరొకరు 1.400 కేజీల బరువున్నారు. బరువు పెరిగేందుకు 19 రోజులు బాక్స్‌లో ఉంచారు. పెద్ద బాబుకు లంగ్స్ ఇన్ఫెక్షన్ ఉంటే మేమే రక్తం ఇచ్చే వాళ్లను తెచ్చి ఇప్పించాం. కానీ చివరి రోజుల్లో చంక దగ్గర క్యాన్‌లా పెట్టారు. అక్కడే రక్తం గడ్డకట్టి చేయి తెల్లబడి వాచిపోయింది. అడిగితే ఆయింట్‌మెంట్ రాయమన్నారు తప్ప పట్టించుకోలేదు. చివరకు స్కానింగ్ చేసి నరాల కదలిక లేదని, చేయి తీసేయాలని చెప్పారు" అంటూ రోదించింది.

పసిగుడ్డు జీవితాన్ని బలితీసుకున్న ఈ అమానవీయ ఘటన మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా పరిగణించింది. ఈ ఘోరంపై సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తునకు స్వీకరించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంతటి నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దీనికి కారణమైన బాధ్యులెవరో తేల్చాలని ఆదేశించింది. మానవ హక్కుల కమిషన్ జోక్యంతో నిద్రలేచిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, తక్షణమే స్పందించి ఈ ఘటనపై లోతైన విచారణ జరిపేందుకు ముగ్గురు సీనియర్ ప్రభుత్వ వైద్యులతో కూడిన ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.

ప్రభుత్వం నియమించిన ముగ్గురు సీనియర్ డాక్టర్ల విచారణాధికారుల బృందం ఖమ్మం జిల్లా ఆస్పత్రికి చేరుకుని సమగ్ర విచారణను పూర్తి చేసింది. బాబుకు చికిత్స అందించిన సమయంలో వార్డులో డ్యూటీలో ఉన్న పిల్లల వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని, వార్డ్ ఇన్‌ఛార్జ్‌లను కమిటీ సభ్యులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. చికిత్సకు సంబంధించిన రికార్డులను, స్కానింగ్ నివేదికలను పరిశీలించారు. ప్రాథమికంగా సిబ్బంది పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. పసిప్రాయంలోనే ఒక నిరుపేద బిడ్డకు శాశ్వత వైకల్యం కలిగించి, ఆ తల్లిదండ్రులకు జీవితాంతం తీరని వేదన మిగిల్చిన డ్యూటీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది.

# తెలంగాణ సెంటిమెంట్ రగిలించే యత్నాలు

**మొదటిపేజీ తరువాయి**

రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. పవన్ కల్యాణ్ ఎప్పుడూ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఆయన సభను అడ్డుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో సమావేశాలు నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరి హక్కు అని ఆయన వ్యాఖ్యానించారు.

పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం జరుగుతోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ఇది రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిసి కనిపిస్తే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని వ్యాఖ్యానించారు. రాజకీయంగా భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

తెలంగాణ సెంటిమెంట్ పేరుతో ప్రజలను మళ్లీ రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన శక్తులతో ఎవరు చేతులు కలిపారో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి దూరంగా ఉన్న వారిని కూడా అధికార రాజకీయాల్లోకి తీసుకువచ్చిన చరిత్రను గుర్తు చేశారు.

మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు హయాంలో తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న వారికే మంత్రి పదవులు ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఏపీలో బీఆర్ఎస్ కార్యాలయం ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా ప్రశ్నించారు. తెలంగాణ నిధులను ఇతర రాష్ట్రాల్లో వినియోగించారన్న విమర్శలు కూడా చేశారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అయిన జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. 12 ఏళ్లుగా నీటి విధానంపై స్పష్టమైన పాలసీ తీసుకురాలేదని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాల విషయంలో కూడా అన్యాయం జరిగిందని ఆరోపించారు.

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన వ్యాఖ్యలు చేశారు. గతంలో మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు.

తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ కీలక పాత్ర పోషిస్తోందని రాంచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ముందుంటుందని చెప్పారు. రాజకీయ విమర్శలకు కాకుండా వాస్తవ సమస్యలపై చర్చ జరగాలని ఆయన సూచించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా కలకం

**మొదటిపేజీ తరువాయి**

ఓ ప్రయాణికుడిని స్క్రీనింగ్ తర్వాత వెంటనే ఐసోలేషన్‌కు తరలించిన ఘటన కలకలం రేపింది.

సూడాన్ నుంచి గురువారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షించారు. ఈ సమయంలో అతనికి ఎబోలా వైరస్ సంబంధిత హిస్టరీ ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్య బృందం అతన్ని ప్రోటోకాల్ ప్రకారం ఐసోలేషన్‌కు తరలించింది. అనంతరం ప్రత్యేక అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి ఐసోలేషన్ వార్డులో ఉంచారు. ఎబోలా అనుమానిత కేసుగా భావించి ప్రయాణికుడి నమూనాలను సేకరించి పరీక్షల కోసం సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీకి పంపినట్లు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఎబోలా వైరస్ అత్యంత ప్రమాదకరమైన వైరస్‌లలో ఒకటిగా భావించబడుతుంది. అందువల్ల విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రయాణికులపై ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహిస్తారు. అదే విధంగా ఈ ఘటనలో కూడా ముందస్తు స్క్రీనింగ్ కారణంగా వెంటనే గుర్తించడం సాధ్యమైందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి.





## పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి : హెచ్ఎం సాంబయ్య

- **ఎల్కపల్లిలో ఇంటింటి ప్రచారం, ప్రభుత్వ విద్యపై అవగాహన**

**ప్రజాస్వరం : వెల్దుర్తి : జూన్ 04**

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా సేవలను సద్వినియోగం చేసుకోవాలని వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య సూచించారు.
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని ఎల్కపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సౌకర్యాలు తదితర అంశాలను వివరించారు.ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించి అధిక ఫీజులతో ఆర్థిక భారం మోసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# హవేలీ ఘనపూర్ రైతుల ఏకగ్రీవ తీర్మానం...

- **రైతు సంక్షేమం కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత.....**

**మెదక్ జూన్ 04 (ప్రజా స్వరం)**

తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో హవేలీ ఘనపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ రైతులతో గురువారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంక్షేమానికి సంబంధించి అంశాలపై చర్చించి, పలు కీలక డిమాండ్లతో ఏకగ్రీవ తీర్మానం చేశారు. రైతు సంక్షేమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత అని పేర్కొంటూ, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు రెండు ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని వారు కోరారు. అనంతరం రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ గ్రామీణ రైతుల ఆర్థిక పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదన్నారు. రైతుల సమస్యలపై పరస్పరం విమర్శలు చేసుకోవడం వల్ల ప్రయోజనం లేదని, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ ప్రధాన డిమాండ్లుగా ఎరువుల పెరిగిన ధరలను తగ్గించడం, అన్ని పంటలకు ప్రస్తుత సాగు ఖర్చులకు అనుగుణంగా కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను రెట్టింపు చేయడం, ఎంఎస్పీకి చట్టబద్ధ హామీ కల్పించడం, రైతు అనుకూల పంటల బీమా పథకాన్ని అమలు చేయడం వంటి అంశాలను ప్రస్తావించడం జరిగిందని అన్నారు. అధిక వడ్డీతో ఉన్న ప్రైవేట్ అప్పుల భారం నుంచి రైతులను బయటపడేసేందుకు ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం అదనపు రుణ సౌకర్యాలను బ్యాంకుల ద్వారా అందించాలని కోరారు. వ్యవసాయ కూలీల కొరత, పెరుగుతున్న వ్యయాలను తగ్గించేందుకు రైతు వాటా 50 శాతంతో వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం, ఇతర పంటల కొనుగోలు ప్రక్రియను సరళీకరించి, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి లేకుండా ముందస్తు ప్రణాళికతో కొనుగోళ్లు నిర్వహించాలని తీర్మానంలో పేర్కొన్నారు. డీజిల్, విద్యుత్, విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రైతుల ఆదాయం పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల పిల్లలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో జనాభా ప్రాతిపాదికన 2025 వరకు ముద్ర రుణాల పంపిణీలో జాతీయ సగటుకు చేరుకోడానికి తెలంగాణ రాష్ట్రం 71 లక్షల ముద్ర రుణాలు వెనుకబడి ఉందని, దీంతో తెలంగాణకు అన్యాయాన్ని జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని బ్యాంకులకు అదనపు లక్ష్యాలను కేటాయించేలా కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ తీర్మానాన్ని హవేలీ ఘనపూర్ గ్రామ రైతులు ఏకగ్రీవంగా ఆమోదించి, రైతు సంక్షేమానికి సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## మూడు గ్రామాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక..

**తూప్రాన్ జూన్ 4 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో ని మూడు గ్రామాల లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం తూప్రాన్ మండలంలోని మూడు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించగా మండలం లోని దాతర్పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆర్డీఓ జయ చంద్ర రెడ్డి , తూప్రాన్ తహసీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి వ్యవసాయ అధికారి (AO) గంగుమల్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభ్యర్ధనలు తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.తూప్రాన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మూడు గ్రామాలలో గ్రామ సభలకు హాజరై ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రత (రోడ్ భద్రత ) మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై గంగరాజు సూచించారు.



## ప్రీ-ప్రైమరీ టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**(ప్రజాస్వరం)మేడ్చల్:**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు మేడ్చల్ ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.ఇన్స్ట్రక్టర్ నెలకు రూ.8,000, ఆయాకు రూ.6,000 గౌరవ వేతనం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు




## ముప్పిరెడ్డిపల్లి కార్యదర్శిగా ప్రియాంక బాధ్యతలు

**మనోహరబాద్ జూన్ 4 ప్రజా స్వరం..**

మనోహరాబాద్ మండలం లో పలు గ్రామాల కార్యదర్శులు బదిలీ అయ్యారు. మండలంలోని మేజర్ పంచాయతి కాళ్లకల్ కార్యదర్శి ప్రియాంక బదిలీపై ముప్పిరెడ్డిపల్లి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.కల్లకల్ నూతన కార్యదర్శి గా కామారెడ్డి జిల్లా బాన్సువాడ నుండి నిరటి నర్సింలు బదిలీపై కాళ్లకల్ కు వచ్చారు. అదేవిదంగా పాలట గ్రామపంచాయతీ కార్యదర్శి గీత, శివంపేట మండలం శభాష్ పల్లికి పాలట గ్రామ పంచాయతీ కార్యదర్శి గా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం కార్యదర్శి మహేందర్ నియామకం అయ్యారు.



ముప్పిరెడ్డి పల్లి గ్రామ కార్యదర్శి స్వామి గౌడ్ తూప్రాన్ మండలం నర్సంపల్లి కి బదిలీ అయ్యారు.

## తూప్రాన్ మున్సిపల్ 1 వార్డు లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**తూప్రాన్ జూన్ 4 (ప్రజస్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ లోని 1 వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గురువారం రోజు తూప్రాన్ మున్సిపాలిటీ 1వ వార్డు లో వార్డు సభలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ప్రజల సమస్య లు అడిగి తెలుసుకున్నారు అర్హులైన వారు నూతన పెన్షన్ లకోసం ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు లు చేసుకోవాలనిఆమె సూచించారు లు ఈ కార్యక్రమం లో ,మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ ఆఫీసర్ రవి శంకర్ పాల్గొన్నారు.




## తూప్రాన్ లో డ్రాంక్ అండ్ డ్రైవ్ లో 8 మంది కి మరో 4గురికి ఒక్కొక్కరికి 10 వేల జరిమానా...

- **ఎస్సై గంగరాజు**

**తూప్రాన్ జూన్ 4 (ప్రజస్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ (D&D) తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడిపిన 8 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి . వారిని కోర్టులో హాజరు పరిచగా మెదక్ కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.80,000 జరిమానా వేశారు అదేవిధంగా, ఈపెట్టి కింద 4 కేసులు నమోదు చేయగా, నలుగురికి సంబంధించి మొత్తం రూ.40,000 జరిమానా వేయడం జరిగింది ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకుండా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని తూప్రాన్ ఎస్సై గంగరాజు సూచించారు.



## రామంతపూర్ తండాకు 'రిక్వెస్ట్ బస్ స్టాప్' మంజూరు

- **ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చొరవతో తీరిన తండావాసుల కష్టాలు**
- **మేడ్చల్ డీఎం ఆదేశాలు, సర్పంచ్ చందర్ నాయక్ కృతజ్ఞతలు**

**ప్రజాస్వరం : మాసాయిపేట : జూన్ 04**

మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ తండా వాసుల బస్సు సమస్యకు పరిష్కారం లభించింది. గురువారం తండా సర్పంచ్ చందర్ నాయక్, ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ సోనీ శ్రీనివాస్ నాయక్ నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని కలిశారు.బస్సు సౌకర్యం లేక తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మేడ్చల్ డిపో డీఎంతో చరవాణిలో మాట్లాడి, రామంతపూర్ తండా వద్ద 'రిక్వెస్ట్ బస్ స్టాప్' ఏర్పాటు చేయాలని సూచించారు.వెంటనే స్పందించిన మేడ్చల్ డీఎం, తండాకు వెళ్లే దారిలో రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్ చందర్ నాయక్‌కు తెలిపారు. అంతేకాకుండా మేడ్చల్ డిపో డ్రైవర్లందరికీ వాట్సాప్ ద్వారా సందేశం పంపి, రామంతపూర్ తండా రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు తప్పనిసరిగా ఆపాలని ఆదేశించారు.ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చొరవతో తమ చిరకాల సమస్య తక్షణమే పరిష్కారమైనందుకు సర్పంచ్ చందర్ నాయక్, ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ సోనీ శ్రీనివాస్ నాయక్, తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. సత్వరం స్పందించి సహకరించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మేడ్చల్ డీఎంలకు రామంతపూర్ తండా ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## జాతీయ జెండాను అవమానించిన వారిని వెంటనే శిక్షించాలి

**నిజామాబాద్ కోటగిరి/ జూన్ 04/(ప్రజాస్వరం):**

నిజామాబాద్ జిల్లా, వర్ని కేంద్రంలోన వ్యవసా మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు అందరు కలిసి జాతీయ జెండా రూపంలో కేకును తయారు చేపించి మన దేశ జాతీయ జెండను అవమాన పరుస్తూ కేక్ కటింగ్ చేయడం జరిగింది, దేశ అవునత్యాన్ని దెబ్బ తీసే విధంగా, చేసిందే కాకుండా, జాతీయ జెండాని పార్టీ జండగ, వక్రీకరిస్తూ, సోషల్ మీడియాలో, వాళ్ళ స్టేటస్ లల్లో పోస్టులు పెట్టుకొని దేశాన్ని హేళన చేయడం దేశ పౌరులందరికీ బాధను కలిగించింది, దేశద్రోహానికి పాల్పడినటువంటి వీరందరి పైన, దేశద్రోహం కేసులు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి తప్పులు ఎవ్వరు చేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోటగిరి బిజెపి మండల అధ్యక్షుడు యముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షుడు హరికృష్ణ, బిజెపి కార్యకర్తలు కతదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం అనుకుంటే నన్ను ఎప్పుడో పట్టుకునేది

- **పరారీలో ఉన్న వ్యక్తిగా అభివర్ణించడంపై లలిత్ మోదీ ఆగ్రహం**
- **భారత్ లాంటి దేశం కళ్లుగప్పి తప్పించుకోవడం అసాధ్యమని వాదన**
- **ఎన్నికల ర్యాలీల్లో తన పేరు ప్రస్తావించడంపై మండిపాటు**
- **రాజకీయ కారణాలతోనే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణ**



ప్రజాస్వరం:

తాను దేశం విడిచి పారిపోయిన వ్యక్తిననే ప్రచారాన్ని ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ తీవ్రంగా ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుకుంటే తనను ఎప్పుడో పట్టుకునేదని అభిప్రాయపడ్డారు. భారత్ లాంటి శక్తిమంతమైన దేశం కళ్లుగప్పి ప్రపంచమంతా తిరగడం అసాధ్యమని వాదించారు. తాను పారిపోతున్నట్లు మీడియానే తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

దేశంలో తనపై ఉన్న కేసులను పూర్తిగా క్లియర్ చేసుకునేందుకు భారత్‌కు తిరిగి వస్తారా? అనే ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానం ఇచ్చారు. రుజువు చేసుకోవాలనే బలమైన కోరిక ఇప్పుడు తనలో లేదని స్పష్టం చేశారు. తనపై వస్తున్న ఆర్థిక అవకతవకలు, మనీ లాండరింగ్ ఆరోపణలను తోసిపుచ్చారు. కేవలం రాజకీయ కారణాలతోనే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో, ఎన్నికల ర్యాలీలలో తన పేరును ప్రస్తావించడంపై మండిపడ్డారు.

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రాహుల్ గాంధీ తనపై విమర్శలు చేస్తున్నారని లలిత్ మోదీ పేర్కొన్నారు. క్రికెట్‌తో ప్రజలకు ఉన్న సెంటిమెంట్‌ను వాడుకోవడానికే తన పేరును ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు. గత 2009లో ఐపీఎల్ టోర్నమెంట్‌ను దక్షిణాఫ్రికాకు మార్చడం వెనుక ఉన్న కథను వివరించారు. అప్పటి హోం మంత్రి చిదంబరం తనను బెదిరించారని, కావాలనే అడ్డుకున్నారని ఆరోపించారు. అప్పట్లో బీజేపీ పాలిత రాష్ట్రాలు మ్యాచ్‌లకు అనుమతి ఇచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరాకరించాయని తెలిపారు. చిదంబరం ఆదేశాల వల్లే టోర్నమెంట్‌ను దక్షిణాఫ్రికాకు మార్చాల్సి వచ్చిందని చెప్పారు. ఇందుకోసం షెడ్యూల్‌ను 154 సార్లు మార్చాల్సి వచ్చిందని వివరించారు.

## సోదరుడు హార్దిక్‌తో గొడవలు.. రూమర్లపై స్పందించిన కృనాల్ పాండ్య

- **తమ్ముడు హార్దిక్ పాండ్యతో విభేదాలు లేవని స్పష్టం చేసిన కృనాల్**
- **తమ మధ్య ఆరోగ్యకరమైన చర్చే జరుగుతుందని వెల్లడి**
- **పాండ్య కుటుంబంలో 10 ఐపీఎల్ ట్రోఫీలు ఉన్నాయన్న కృనాల్**
- **ఐపీఎల్ 2026 మ్యాచ్ సందర్భంగా మొదలైన పుకార్లు**
- **సోషల్ మీడియా ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టిన కృనాల్ పాండ్య**

ప్రజాస్వరం:

టీమిండియా ఆల్‌రౌండర్లు, పాండ్య సోదరులైన కృనాల్, హార్దిక్ మధ్య విభేదాలు తలెత్తాయంటూ వస్తున్న వార్తలపై కృనాల్ పాండ్య స్పందించాడు. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, తమ బంధం మైదానంలోనూ, బయట కూడా చాలా బలంగా ఉందని స్పష్టం చేశాడు.

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ ఔటైనప్పుడు కృనాల్ ఉత్సాహంగా సంబరాలు చేసుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనికి తోడు, ఆర్సీబీ టైటిల్ గెలిచిన తర్వాత హార్దిక్ తన సోదరుడిని అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయనే ప్రచారం మొదలైంది.

ఈ ఊహాగానాలపై కృనాల్ స్పందిస్తూ, "మేమిద్దరం కలిసే క్రికెట్ ఆడాం. ఆటలోని వ్యూహాలు, టెక్నిక్ గురించి ఎప్పుడూ చర్చించుకుంటాం. మా మధ్య ఆరోగ్యకరమైన చర్చే ఉంటుంది. ఒకే క్రీడలో ఇద్దరు సోదరులు ఉన్నప్పుడు ఒకరికొకరు అండగా నిలుస్తారు. దేవుడి దయవల్ల పాండ్య కుటుంబంలో 10 ఐపీఎల్ ట్రోఫీలు ఉండటం చిన్న విషయం కాదు" అని వివరించాడు. హార్దిక్ 5, తాను 5 ఐపీఎల్ టైటిళ్లు గెలిచామని తెలిపాడు.



## క్రికెటర్ కాకముందు పాస్‌పోర్ట్ ఏజెంట్, కార్ బ్రోకర్.. కృనాల్ పాండ్యా గతం ఇదే!

- **ఆర్సీబీ ఆల్‌రౌండర్ కృణాల్ పాండ్యా కెరీర్ ఆరంభంపై సంచలన విషయాల వెల్లడి**
- **చిన్నతనంలో తండ్రితో కలిసి పాస్‌పోర్ట్ ఏజెంట్‌గా, సెకండ్ హ్యాండ్ కార్ బ్రోకర్‌గా పనిచేసిన వైనం**
- **ఒక్కో కార్ డీల్‌పై రూ. 3 వేల కమీషన్ కోసం పేపర్‌వర్క్ చేసిన కృనాల్**
- **ఐపీఎల్ 2026లో 226 పరుగులు, 14 వికెట్లతో కీలక పాత్ర**
- **నాటి పేదరికమే మైదానంలో పోరాడే తత్వాన్ని, గెలిచే కసిని నేర్పిందన్న కృనాల్**



ప్రజాస్వరం:

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) జట్టు వరుసగా రెండోసారి ట్రోఫీని ముద్దాడటంలో కీలక పాత్ర పోషించిన ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా.. తాను క్రికెట్ స్టార్ కాకముందు అనుభవించిన కష్టాలను, తన పేదరికపు గతాన్ని గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యాడు. తాను ఒకప్పుడు పాస్‌పోర్ట్ ఏజెంట్‌గా, సెకండ్ హ్యాండ్ కార్ బ్రోకర్‌గా పని చేస్తూ రోజులు వెళ్లదీశానని సంచలన విషయాలను బయటపెట్టాడు. 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కృనాల్ మాట్లాడుతూ.. గ్లామరస్ ఐపీఎల్ లైఫ్‌స్టైల్ వెనుక ఉన్న తన అసలు జీవితాన్ని, తండ్రితో కలిసి చేసిన పోరాటాన్ని పంచుకున్నాడు.

ప్రస్తుతం ఆర్సీబీ జట్టులో అత్యంత కీలక ఆటగాడిగా మారిన కృనాల్ పాండ్యా, ఈ 2026 సీజన్ లో 145.80 స్ట్రైక్ రేట్‌తో 226 పరుగులు చేయడమే కాకుండా, 16 మ్యాచ్‌లలో 14 వికెట్లు తీసి జట్టు టైటిల్‌ను కాపాడుకోవడంలో (Title Defence) వెన్నెముకలా నిలిచాడు. ఈ సక్సెస్ అనంతరం తన గతాన్ని గుర్తుచేసుకుంటూ.. "నాకు 11 లేదా 12 ఏళ్లు ఉన్నప్పుడు మా నాన్న హిమాన్షు పాండ్యాతో కలిసి పని చేయడం ప్రారంభించాను. మా నాన్న పాస్‌పోర్ట్ అడ్వైజర్ ఏజెంట్. నేను కూడా స్వయంగా పాస్‌పోర్ట్ ఏజెంట్‌గా మారాను. ఆ సమయంలో ప్రజల కోసం రేషన్ కార్డులు తయారు చేసేవాడిని" అని కృణాల్ తెలిపాడు.

పాస్‌పోర్ట్ పనులే కాకుండా ఆ తర్వాత సెకండ్ హ్యాండ్ కార్ల బ్రోకరేజ్ వ్యాపారంలోకి కూడా దిగినట్లు కృనాల్ వెల్లడించాడు. సాధారణంగా రూ. 3 నుంచి 4 లక్షల విలువైన సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలను పూర్తి చేస్తే.. ఒక్కో డీల్‌పై తనకు కేవలం రూ. 3,000 కమీషన్ వచ్చేదని చెప్పాడు. ఇందుకోసం ఆఫీసుల చుట్టూ తిరగడం, ఫారాలు నింపడం, కోర్టు అఫిడవిట్లు సిద్ధం చేయడం, పేర్ల సవరణల కోసం వార్తాపత్రిక కార్యాలయాలకు వెళ్లడం వంటి అన్ని రకాల అడ్మినిస్ట్రేటివ్ పనులను తానే స్వయంగా చూసుకునేవాడినని గుర్తుచేసుకున్నాడు.

చిన్న వయసులోనే జీవితాన్ని చాలా దగ్గరగా, కష్టాల మధ్య చూడటం వల్లే.. ఇప్పుడు క్రికెట్ మైదానంలో ఎంతటి కఠినమైన పరిస్థితి ఎదురైనా తాను అస్సలు లొంగిపోనని కృనాల్ ధీమా వ్యక్తం చేశాడు. "మనం జీవితాన్ని ఎలా జీవిస్తామో.. ఆటను కూడా అలాగే ఆడతాం. మ్యాచ్ క్లిష్టంగా మారినప్పుడు 'నేను ఎలాగైనా గెలవాలి' అనే కసి నాలో పెరుగుతుంది. ఆ పట్టుదల నాకు నా చిన్ననాటి కష్టాల నుంచే వచ్చింది" అని వివరించాడు. తండ్రిని కోల్పోయిన తర్వాత, నాటి రోజులను తలచుకుంటూ మైదానంలో ఒత్తిడిని భారంలా కాకుండా ఒక అవకాశంగా మార్చుకుంటున్నానని కృనాల్ చెప్పిన మాటలు సోషల్ మీడియాలో అభిమానుల గుండెలను పిండేస్తున్నాయి.

## టీమ్‌ఇండియాకు షాక్.. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం!


- **తొడ కండరాల గాయంతో బాధపడుతున్నట్లు సమాచారం**
- **ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో గాయపడినట్లు తెలుస్తోంది**
- **ఐపీఎల్ ఫామ్‌ను కొనసాగిస్తాడని ఊహించిన ఫ్యాన్స్‌కు నిరాశ**
- **వన్డే ప్రపంచకప్‌లో ఆడడంపై గాయం ప్రభావం ఉండే ఛాన్స్**

ప్రజాస్వరం:

ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఆయన తొడ కండరాల గాయంతో బాధపడుతున్నట్లు పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. భారత జట్టుకు ఇది పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి. జూన్ 13 నుంచి 20 వరకు మూడు వన్డేల సిరీస్ జరగాల్సి ఉంది. ఇటీవల జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీకి ఈ గాయమైనట్లు సమాచారం. ఆ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ఆర్‌సీబీ విజయం సాధించి వరుసగా రెండోసారి టైటిల్ గెలుచుకున్న విషయం తెలిసిందే.

ఆ ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీ 42 బంతుల్లో 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అహ్మదాబాద్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ముగిసే సమయంలో కోహ్లీ పరుగులు తీయడానికి ఇబ్బంది పడుతూ కనిపించాడు. అయినప్పటికీ మ్యాచ్‌ను అద్భుతంగా ముగించగలిగాడు. ఈ ఐపీఎల్ సీజన్ మొత్తం కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో కనిపించాడు. 16 మ్యాచ్‌ల్లో 56.25 సగటుతో, 165.85 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 675 పరుగులు చేశాడు.

ఐపీఎల్ ఫామ్‌ను ఆఫ్ఘన్ సిరీస్‌లోనూ కోహ్లీ కొనసాగిస్తాడని అంతా భావించారు. తద్వారా 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడే అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలని కోహ్లీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ తరుణంలోనే ఆయన గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ గాయం తీవ్రత, సిరీస్‌కు అందుబాటులో ఉంటారా లేదా అనే దానిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## పంత్ పరిస్థితులకు తగ్గట్లుగా ఆడాలి.. అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డష్కాటే సూచన

- **ఆఫ్ఘన్‌తో శనివారం ఏకైక టెస్ట్ సిరీస్ ప్రారంభం**
- **వైస్ కెప్టెన్సీ తొలగింపుపై పంత్‌కు బాధలేదన్న అసిస్టెంట్ కోచ్**
- **నాయకత్వానికి అధికారిక పదవులు అవసరం లేదని వ్యాఖ్య**
- **సరైన నిర్ణయాలు తీసుకోవడంపైనే దృష్టి పెట్టాలని సూచన**



ప్రజాస్వరం:

టీమ్‌ఇండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా తన బ్యాటింగ్ శైలిని మార్చుకోవాలని భారత జట్టు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డష్కాటే సూచించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో శనివారం ప్రారంభం కానున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. నాయకుడిగా ఎదగడానికి అధికారికంగా ఎలాంటి పదవులు అవసరం లేదని డష్కాటే అభిప్రాయపడ్డాడు. ఆటలో జట్టు పరిస్థితిని బట్టి సరైన నిర్ణయాలు తీసుకోవడంపైనే పంత్ దృష్టి పెట్టాలని సూచించాడు. గత నెలలో ఆఫ్ఘనిస్థాన్ టెస్టు కోసం జట్టును ప్రకటించిన సమయంలో పంత్‌ను బీసీసీఐ వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

ఈ నిర్ణయంపై స్పందించిన డష్కాటే.. వైస్ కెప్టెన్ పదవి నుంచి తీసేయడంపై పంత్‌కు ఎలాంటి ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు లేవని స్పష్టం చేశాడు. అతడు ఈ మార్పును చాలా సానుకూలంగా తీసుకున్నట్లు చెప్పాడు. పంత్ ఇప్పటివరకు 49 టెస్టుల్లో 42.91 సగటుతో మొత్తం 3,476 పరుగులు చేశాడు. అతడి దూకుడుగా ఆడే శైలి భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించినప్పటికీ.. కొన్నిసార్లు అనవసరమైన షాట్లు ఆడి వికెట్ పారేసుకుంటారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో పంత్ ఘోరంగా విఫలమయ్యాడు. కేవలం 12.25 సగటుతో 49 పరుగులు మాత్రమే చేయగలిగాడు.

వైస్ కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ ఆఫ్ఘన్‌తో జరిగే టెస్టు మ్యాచ్ కోసం ఎంపిక చేసిన 15 మంది సభ్యుల భారత జట్టులో పంత్ కొనసాగుతున్నాడు. ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా.. కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. పంత్‌తో పాటు యశస్వీ జైస్వాల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే, ధ్రువ్ జురెల్ ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999